గుంటూరు లేఖ * * *

# ఛైర్మెన్‌గా శ్రీ హనుమయ్య

ఈలేఖ అచ్చుకుపోతున్న సమయంలో ఛైర్మెన్‌గా శ్రీ వేమ్రోలు హనుమయ్యగారు 17 ఓట్ల మెజారిటీతో ఎన్నికోబడినట్లు వార్త వచ్చింది. శ్రీ హనుమయ్యకు 25, వారితో పోటీచేసిన కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ కె. మల్లయలింగంకు 8 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికనుబట్టి 'సిటిజన్సుఫ్రంట్' ఏకగ్రాటి మీద నిలబడినట్లే చెప్పవచ్చు.

ఎన్నికకు ముందు మా విలేఖరి 'శిలానంద్' వ్రాసినవార్తలు చదవండి.

—సం. ఆం. రై.

'శిలానంద్'

## ఏదిసత్యం? ఏదసత్యం?

గుంటూరు పురపాలకసంఘ ఎన్నికల అనంతరం సామ్రాజ్యపట్టాభిషేకమట్లు ఈనెల 26 వ తేదిన రక్తికట్టనున్నది. ఎవరికివారు 'ఛైర్మెన్'గావాలని తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తూవుంటే, వీటిమీద 'యం' కోసం కొందరు 'ఫోర్మెన్'లుగా మారి ఋబిబుద్ధపుకబుర్లతో అంతా 'మసి పూసి మారేడుకాయ' చేయజూస్తున్నారు.

అధ్యక్ష పదవి నాకాంక్షిస్తున్నవారిలో శ్రీ వేమ్రోలు హనుమయ్య కొంతలోకొంత ప్రజలకు మేలుచేయాలనే తత్వంగలవ్యక్తి. స్నేహపాత్రుడు. అందరికీ తలలో నాలుక వలె మసలే సహృదయుడు. కాని జిల్లా రాజకీయాలలో ఒకరినిమించిన రాజకీయులు మరొకరు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తమ కుల స్థులుకాని తెలగవారికోసం కృషిచేస్తుంటే, తెలగవంశీయులైన శ్రీ అబ్బయ్యగారిలాంటి వారు శ్రీ వేమ్రోలు హనుమయ్యగారికోసం కృషిచేస్తున్నారు. అందువల్లనే యిందులో ఏదిసత్యం? ఏదసత్యం? అన్న శంక సామాన్యుని గాధిస్తోంది. కుల మత వర్గ రహితమైనపాలనకోసే మనదేశంలో ఈనాడు అవే విలయతాండవం సాగిస్తూ వుండటం, అధికార అనధికారవర్గాలలో సైతం అవే కొలబద్దలుకావడం శోచనీయం.

—కొరవ 10 వ పేజీలో




డాక్టరు వైద్యుల చంద్రశేఖరం

# కేవలం "మానోయాక్టర్" కాదు-
# ఒక "మాస్ యాక్టర్"



శ్రీ చంద్రశేఖరంగారిని తెలియనివారు ఆంధ్రలోలేరు. బహురూపానుకరణ, బహుపాత్రాభినయవిద్యార్థిగా ముప్ఫయివిండ్లనాడు కళారంగంలో ప్రవేశించి, అందులో నిష్ణాతుడైన శ్రీ చంద్రశేఖరం ఈవారంలో 60 ఏట కాలిడినారు. శ్రీ చంద్రశేఖరం జిల్లాబోర్డు గుమాస్తాగానే జీవితం కొనసాగించివుంటే, ఈపాటికి రిటైర్అయి, కృష్ణ రామ అనుకుంటూ, కాలాన్ని బరువుగా లాగుతూ వుండేవారు. కాని శ్రీ చంద్రశేఖరంలో ఈనాడు, ఈ అరవయ్యవపడిలోగూడా నూతనోత్సాహం పురకలు వేస్తున్నది; కళారంగంలో నవ్యరీతులవైపు వారివూహలు, ఆలోచనలు పరుగులుదీస్తున్నవి. ఇన్ని దశాబ్దాలుగా ఏకాకిగా కళాతపస్సుచేస్తున్న శ్రీ చంద్రశేఖరంగారి షష్టిపూర్తి సందర్భంలో అభినందన సూచకంగా వారి కళాసేవనుగూర్చిన శ్రీ బండి గోపాలరెడ్డిగారి వ్యాసాన్ని ప్రకటిస్తున్నాము.

—సం. ఆం. రై.

1931-32 ప్రాంతం. మద్రాసు విక్టోరియా పబ్లిక్‌హాలులో ఇంగ్లండునుంచి వచ్చిన నటీనటబృందం ఒక నాటకం వేయబోతున్నారు. రాత్రి 9-30 గంటలకు నాటకం ప్రారంభమౌతుంది. నాటక కంపెనీ మేనేజరును కలుసుకోవాలని ధోవతి, లాల్చీ తొడుక్కొనివున్న ఒక భారతీయ యువకుడు 7 గంటలకేవచ్చి హాలు ప్రవేశ ద్వారందగ్గర చేరాడు. అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. 8 అయింది, 9 అయింది, మేనేజరు వచ్చినట్లులేదు. యువకుని ముఖంలో విసుగూ, వేసట కనుపిస్తున్నవి. గేటుదగ్గరున్న వ్యక్తిని పదేపదే అడుగుతున్నాడు మేనేజరుగారు వచ్చారా అని. 9-10 గంటలైంది. గేటువద్దవ్యక్తి సైగచేశాడు. గేటుదగ్గర నిల్చొని హాల్లోకి వచ్చిపోయేవాళ్లను చూస్తూవున్న ఒకవ్యక్తిని చూపించాడు. వెళ్లాడు. వారిద్దరి మధ్య ఈ సంభాషణ జరిగింది.

## బ్రహ్మకు నాల్గుముఖాలు; రావణునికి పది ముఖాలు; మరి చంద్రశేఖరానికి?

"ఈకంపెనీ మేనేజరుగారితో మాట్లాడవచ్చునాండీ?"

"ఏం కావాలండీ"

"గ్రీన్ రూములోకి వెళ్లడానికి పర్మిషనిస్తారా అని అడుగుదామని"

"ఏం, అక్కడకెందుకు వెళ్ళాలనుకొంటున్నారు"

"నేనొక పిల్లనటుణ్ణి. ఈ కంపెనీ నటీనటులు ఎట్లా వేషాలువేసుకుంటారో దగ్గరగావుండి చూడాలనివుంది. ఆ కళకాస్త అయినా అబ్బుతుందేమోనని"

"ఓహ్, మే మెట్లా వేషాలు వేసుకొంటామో తెలుసుకోవాలనుకున్న మొదటి భారతీయుడివి. మంచిది. నేనే మేనేజరును, ప్రధాన పాత్రధారిని. నిన్ను కలుసుకొన్నందుకు చాల సంతోషం" అని ఆ యువకుని భుజంమీద ఆప్యాంగా చేయివేసి-"లోపలకు పోదాంరా" అని లోనికి దారితీశాడు.

ఇదీ ఆ సంభాషణ. ప్రఖ్యాత బ్రిటిష్ నటుడు, నాటక నిర్మాత శ్రీ గ్రాంట్ యాండర్‌సన్-నెల్లూరు వారుడు, అప్పటికొక పిల్లనటుడుగానే వున్న-శ్రీ వైద్యుల చంద్రశేఖరానికి మధ్య సాగినదీ ఆ సంభాషణ.

గ్రీన్ రూంలోకి వెళ్లగానే, గ్రాంట్ యాండర్‌సన్ వేషం వేసుకొంటున్నాడు, దగ్గరుండి చంద్రశేఖరం నివ్వెరపోతూ చూస్తున్నాడు, మధ్య మధ్య మేకప్ మర్మాల్ని చంద్రశేఖరానికి వివరిస్తూ పదినిముషాలకల్లా వేషం పూర్తిచేసుకున్నాడు.... అంతే అప్పటినుంచీ "గ్రాంట్ యాండర్‌సన్ నా గురువు"

శ్రీ బండి గోపాలరెడ్డి
బి. కాం (ఆనర్స్)

అంటాడు చంద్రశేఖరం. మళ్లీ 1933 లో నాగపూర్‌లో కాబోలు యాండర్‌సన్‌గార్ని కలిశాడు. ఆయన చంద్రశేఖరాన్నిచూసి ఆనందపడ్డాడు. అడిగాడు "ఎంతవరకు వచ్చింది నీ కృషి" అని. "ఇవాళ నా ప్రోగ్రాంవుంది. షేక్స్పియర్ నాటకాలలోని పాత్రలనేకం నటించాలి. తెరదిగగానే గ్రీన్ రూంలోకి వస్తూండు, నేనెలా వేషాలు మార్చుకొంటానో చూద్దువుగాని..." అని అన్నాడు. మార్క్ యాంటోనీగా, ఒథెల్లోగా, షైలాక్‌గా - చకచకమని త్వరత్వరగా వేషం మార్చుకోవడం - చంద్రశేఖరం అతిదగ్గరగావుండి చూశాడు. యాండర్‌సన్ మధ్య మధ్య మేకప్ రహస్యాలు చెప్పాడు. చంద్రశేఖరానికదొక మహత్తరమైన గురూపదేశం, అనుభవం, అంతే. తనకున్న కొద్దిపరికరాలతో - అప్పుడప్పుడూ Ericward వ్రాసిన Book of Makeup అనే పుస్తకాన్ని పరిశీలన గ్రంథంగా వాడుకొంటూ, కొన్నాళ్లలోనే చంద్రశేఖరం గురువుకుమించిన శిష్యుడని పించుకున్నాడు. బహురూపానుకరణ, బహుపాత్రాభినయకళలో బహుముఖప్రజ్ఞావంతుడై అఖిలాంధ్ర, అఖిలభారత కీర్తి నందుకోగలిగాడు.

చంద్రశేఖరంగారి జీవితంలో ఇలాంటిదే మరో అనుభవంకూడా. ఒకరోజు ఒక మిత్రునింటికెళ్లాడు మిత్రుని కల్సుకోడానికి. ఆయన ఇంట్లో లేడు. ఒకగంట తర్వాతగాని రాడని తెల్సింది. ఎట్లా ఈ గంటగడపడం అని కాస్త చిరాగ్గా నడిచి వెళ్తుంటే దగ్గర్లోనే ఒక రీడింగురూము కనిపించింది. అందులోకి దూరబడ్డాడు. బల్లమీద "నేషనల్ జాగ్రాఫికల్ మేగజైను" అనే పత్రిక తనవైపు గుడ్లురిమి చూస్తుండడం గమనించాడు. నిర్లిప్తంగా ఆ పత్రిక తీసుకొని పేజీలు తిరగేస్తున్నాడు. ఆశ్చర్యం, అందులో ఒకవ్యాసం తనదృష్టి నాకర్షించింది. పరమానందంతో గుక్క తిప్పుకోకుండా గబగబ చదివేశాడు ఆ వ్యాసభాగాన్ని. ఆ వ్యాసం పేరు "ఫ్రాంసు సంచారనటులు" (France's Travelling players") అందులో విశేషం-కొంతమంది స్త్రీ పురుషులు, తమకున్న నాటకాల పిచ్చికొద్దీ, తమ ఉద్యోగాలకు రాజీనామాలు గీకేసి- ఒక సంచారనటకబృందంగాకూడి-కొద్దిపాటి సరంజామాతో, దేశసంచారంచేస్తూ ఎక్కడబడితే అక్కడ

—కొరవ 10-వ పేజీలో



నటసామ్రాట్ శ్రీ పృథ్వీరాజ్ కపూరుతో శ్రీ చంద్రశేఖరం

